# సానుభూతి

శారదా అశోకవర్ధన్

తలుపు గడియవేసొచ్చి "రామ్మా... రెండు మెతుకులు తిందువుగాని" అంటూ చెయ్యిపట్టి లేపింది భారతి చెల్లెలు పరిమళని.

"ఒద్దే... నాకు తినాలనిలేదు..." కళ్లు తుడుచుకుంటూ మళ్లీ కుర్చీలోనే కూలబడిపోయింది పరిమళ.

గోడమీదవున్న పాత గంటల గడియారం సమయాన్ని సూచిస్తూ పదిగంటలు కొట్టింది.

"అలా అంటే ఎలాగమ్మా... పొద్దుటి నుంచి అలా ఏడుస్తూనే వున్నావు. ఎంత ఏడిస్తే మటుకు ఏం లాభం? భవిష్యత్తుని, పిల్లలనీ దృష్టిలో పెట్టుకో. ఇలా నువ్వు తినకుండా కూర్చుంటే... నీ ఆరోగ్యం చెడిపోతే అమూల్యనీ, అపురూపనీ ఎవరు చూస్తారు చెప్పు? వాళ్లు బెంగపెట్టుకోరూ! లే..." అని బలవంతంగా లేపి, డైనింగ్ టేబుల్ దగ్గరికి తీసికెళ్లింది భారతి.

కంచంతీసి కూరా, అన్నం వడ్డించి కూర కలిపి ఒక ముద్ద నోట్లో పెట్టింది. పదేళ్ల అమూల్య, అపురూపా కూడా వొచ్చి తల్లిపక్కన కూర్చున్నారు. వాళ్లని చూడగానే కళ్లుతుడుచుకుని, వాళ్లిదర్నీ దగ్గరికి తీసుకుని అక్క పెట్టిన ముద్ద మెల్లగా నమిలి మింగింది పరిమళ.

కాలింగ్ బెల్ మోగడంతో "ఎవరుబాబూ?" అనుకుంటూండగానే రఘునాథ్, అతని భార్య జానకీ లోపలికొచ్చారు. వాళ్లని చూడగానే గబుక్కున కంచంలో చెయ్యికడిగేసుకుంది పరిమళ. భారతి మనసు కలుక్కుమంది. మధ్యాహ్నం కూడా ఇలాగే రెండుముద్దలు అతికష్టం మీద తినిపించేసరికి ఎవరో రావడం, పరిమళ చెయ్యి కడిగేసుకోవడం అయింది. అతికష్టంమీద సాయంత్రం ఎప్పుడో గుక్కెడు కాఫీ నీళ్లు తాగింది. చేసేదిలేక అమూల్యకి, అపురూపకీ పాలుకలిపి ఇచ్చి, తాగేసివెళ్లి సుమతక్క దగ్గరకెళ్లి పడుకోమని చెప్పింది.

సుమతీ, వేణూ భారతి పిల్లలు. వేణు ఎం.బి.యే. చేస్తున్నాడు. సుమతి ఎం.సి.యే.లో చేరింది. టేబుల్ శుభ్రంచేసి వెళ్లి భారతి పరిమళ పక్కన కూర్చుంది. శ్రీరాం పోయి అప్పుడే పదిహేనురోజులవుతున్నా పదమూడో రోజు బంధువులందరూ వెళ్లిపోయినా, భారతిమాత్రం వుండిపోయింది. పరిమళ కాస్త తేరుకునేదాకా వుందామని.

డిసెంబరు సెలవులు కనుక పిల్లలూ వుండిపోయారు. కానీ, ఈ పరామర్శకి ఒక సమయం అంటూ లేకుండా ఎప్పుడంటే అప్పుడు రావడం... తీరిగ్గా కూర్చుని, ఎక్కడలేని సానుభూతి కబుర్లు చెబుతూ, ఎక్కడెక్కడ ఎలా ఎలా ఈ మరణాలు ఎవరెవరికి జరిగాయో కథల్లా చెబుతూ, అసలే బాధపడుతూన్న ఆ వ్యక్తులను వారి సానుభూతి మాటలతో, ఇతర ఉదాహరణలతో మరింత ఏడిపించి ఏడిపించి పోతారు.

భారతి విసుగ్గా కూర్చుంది ఆ వొచ్చినవాళ్లు ఎప్పుడు పోతారా అని. ఆమె బాధంతా కంచంలో కలిపిన ఆ నాలుగు ముద్దలూ పరిమళ తినేస్తే కాస్త ఓపికవొస్తుంది. ఏదో ఒక నిద్రమాత్ర వేసి పడుకోబెట్టవచ్చు అనుకుంది. అలా కాకుండా ఆ వొచ్చిన వాళ్లు స్నేహితులే

అయినా, 'ఆమె అన్నం ముందునుంచి లేచిపోయిందే తినకుండా' అన్న బాధ ఏకోశానా లేదు. శ్రీరాం ఎంతమంచి వాడో, అంత మంచివాడికి ఈ యాక్సిడెంట్ ఎందుకు జరిగిందో, ఎలా నవ్వుతూ మాట్లాడేవాడో ఇలాగ ఏవేవో చెప్పి చెప్పి... పరిమళ వెక్కివెక్కి ఏడ్చేవరకూ చెప్పడం. కాస్త ఆమె ఏడుపు మానగానే మళ్లా ఏదో సంఘటన జ్ఞాపకంచేసి మళ్లీ ఏడిపించడం. ఏడుస్తుంటే 'పాపం' అంటూ సానుభూతి చూపించడం తప్ప కనీసం 'నాలుగు మెతుకులు తినమని బలవంతం చెయ్యడమో, లేకపోతే ఆమె నూరడించే నాలుగు మాటలు చెప్పి వెళ్లిపోవడమో కాకుండా, సెకండ్‌షో సినిమా కొచ్చినట్టు రాత్రి పన్నెండు గంటలదాకా కూర్చుంటే... అది సానుభూతి అనుకోవాలా? లేకపోతే వాళ్లకొకరకమైన కాలక్షేపం అనుకోవాలా? చివరికి భారతి వాళ్లకోసం రెండుకప్పుల్లో కాఫీ తెచ్చిచ్చి, పరిమళకి ఒక కప్పులో పాలు కలిపి తీసికెళ్లింది. ఏడ్చి ఏడ్చి మనసు వికలమైపోయిన పరిమళ "ఒద్దక్కా తాగలేను" అంటూ తోసిపుచ్చింది.

"అన్నంకూడా తినలేదు. కాసిని పాలైనా తాగకపోతే ఎలా?" బ్రతిమిలాడి కప్పు నోటికందించింది భారతి.

"పాపం అంత దుఃఖంలో వుందావిడ...? ఎలా తాగుతుందండీ" అంది ఆ వొచ్చినావిడ భారతిని చూసి.

"తాగలేపోతే ఎలాగమ్మా? పోయిన వాళ్లతో మనమూ పోలేంగా! పిల్లల కోసమైనా తిని తన ఆరోగ్యాన్ని కాపాడుకుని మామూలు మనిషవ్వాలి" అంది కాస్త అసహనంగానే భారతి.

అప్పటికీ ఆ వొచ్చినవాళ్లు అర్థం చేసుకోకుండా, "మనం అలాగే చెప్తాం. ఆవిడనోటికి



పోవొద్దూ" అంది దీర్ఘం తీస్తూ.

'ఇదేం పరామర్శరా నాయినా?... మనిషి పోయాడన్న దుఃఖం బయటి వాళ్లందరికన్నా ఆ కుటుంబీకులకే ఎక్కువగా వుంటుంది. శ్రేయోభిలాషులు, స్నేహితులూ సాధ్యమైనంత వరకూ వాళ్ల దుఃఖాన్ని మరిపించే ప్రయత్నంగా వేరే మాటలు మాట్లాడాలి. అవి కూడా సందర్భోచితంగా వీలైనంత తక్కువగా. అంతేకానీ సానుభూతి వొలకబోస్తూ వాళ్లని కుళ్లబెట్టిపొడిచినట్టు ఏడిపించడం కాదు' అనుకుంటూ కోపాన్ని అణుచుకుని, భారతి లోపలికెళ్లి నిద్రమాత్ర, మంచినీళ్లు పట్టుకుని, "పోనీ ఈ టాబ్లెట్టయినా వేసుకో" అంటూ నీళ్ల గ్లాసు, నిద్రమాత్రా అందించింది పరిమళకి.

అంతలో "అమ్మా" అంటూ లోపల్నుంచి అపురూప పిలవడంతో లేచి వెళ్లింది పరిమళ. భారతి 'ఇక మీరు వెళితే బాగుంటుందన్నట్టు' వాళ్లకేసి చూసింది. ఆ చూపుల్ని చదవగలిగారేమో "ఇంక మేము వెళతాం. పొద్దున్నే వేరే ఏదో పనుంది మాకు" అంటూ "పరిమళగారికి చెప్పివెళతాం" అంది ఆవిడ.

"నే చెప్తాలెండి. పిల్లలు పిలిచారు కదా వెళ్లింది" అంది భారతి.

"సరే"నంటూ బయల్దేరారు వాళ్లు.

వెంటనే తలుపు గడియవేసింది భారతి.

"ఇదేం పరామర్శమ్మా... వేళాపాళా లేకుండా గంటల గంటలసేపు. అనవసరమయిన సానుభూతి" అంది పరిమళ పిన్నత్తగారు విజయలక్ష్మి.

"అలా గంటలు గంటలు కథలు కథలతో ఏడ్చేవాళ్లని ఇంకా ఏడిపించడమేనా సానుభూతి?" విసుక్కుంటూ, పాలగ్లాసునందించి పరిమళచేత పాలు తాగించింది భారతి. దైవ ప్రార్థన చేస్తూ పడుకో అని చెప్పింది. పాలుతాగి పిల్లలిద్దరి మధ్యా వాళ్లమీద చెయ్యివేసి పడుకుంది పరిమళ.

భారతి తృప్తిగా నిట్టూర్చింది... సానుభూతి కాదు... బతికించడానికి, ఊరట కలిగించడానికి ఒక మంచిమాట చాలు అనుకుంటూ. ●



మానస ఆర్ట్ థియేటర్స్ ఆధ్వర్యంలో హైదరాబాద్‌లో జరిగిన సభలో లక్కర్సు ఎస్.ఎన్. మూర్తి సంకలన గ్రంథాలను ఆవిష్కరించిన ఓ.యు. రిజిస్ట్రార్ ఆచార్య వై.సి. వేణుధర్. చిత్రంలో రఘుశ్రీ, డా॥ జి.వి. రమణబాబు, అచ్చా సత్యనారాయణ, జె.వి. రావు ఉన్నారు.